సాక్షి విశాఖపట్నం

శనివారం ꞉ 26 ꞉ జూలై ꞉ 2025

శ్రావణం.. శుభకరం







శ్రావణ మాసం తొలి శుక్రవారం సందర్భంగా విశాఖ.. ఆధ్యాత్మిక శోభతో వెల్లివిరిసింది. కన్యకాపరమేశ్వరి అమ్మవారు ముత్యాల చీరలో భక్తులను కటాక్షించగా.. సింహగిరిపై సింహవల్లీ తాయారుకు లక్ష కుంకుమార్చన వైభవంగా జరిగింది. శ్రీ కనకమహాలక్ష్మి ఆలయంలో నెల రోజుల పాటు జరిగే శ్రావణలక్ష్మి పూజలు ఘనంగా ప్రారంభమయ్యాయి. 8లో

సూత్రధారుల జోలికి వెళ్లని నాలుగో సింహం



- కీలక కేసుల్లో ప్రధాన నిందితుల అరెస్టులో జాప్యం
- క్రికెట్ బెట్టింగ్, శాంతి ఆశ్రమం, డ్రగ్స్ కేసులన్నింటిదీ అదే తీరు..
- బెయిల్ వచ్చేంత వరకూ అరెస్టు చేయకుండా తాత్సారం
- ఆశ్రమం కేసులో అసలు దోషులపై సా...గుతున్న వేట
- తిమ్మాపురం వద్ద తెల్లవారుజామున దర్జాగా కబ్జా యత్నాలు
- ఇప్పటికీ ముసుగుతీయని పోలీసుల విచారణ

సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం:

నగరంలో ట్రాఫిక్ నియంత్రించేందుకు అత్యాధునిక ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ)ను ఉపయోగిస్తున్నాం!

డ్రోన్లను ఎగురవేసి నగరంలో అసాంఘిక కార్యకలాపాల కట్టడికి ప్రయత్నిస్తున్నాం!!

ఇవీ ఉదయం లేచినప్పటి నుంచి విశాఖ నగర పోలీసులు పలుకుతున్న సాంకేతిక బీరాలు. అయితే, కీలక కేసుల్లో మాత్రం అసలు సూత్రధారులు దర్జాగా తప్పించుకు తిరుగుతున్నారు. ఏకంగా బెయిల్ వచ్చే వరకూ అరెస్టు చేయకుండా విశాఖ పోలీసులు తాత్సారం చేస్తున్నారనే విమర్శలున్నాయి. ఇక తిమ్మాపురం వద్ద వివాదాస్పద భూమిలో అర్ధరాత్రి ముసుగులు వేసుకుని నంబరు ప్లేట్లు లేని వాహనాల్లో హల్‌చల్ చేసి ఉన్న రూంను నేలమట్టం చేసిన వ్యవహారంలో అసలు దోషులెవరో ఇప్పటికీ విశాఖ పోలీసులు ముసుగుతీయకపోవడం గమనార్హం. ఇక శాంతి ఆశ్రమం వద్ద జరిగిన దాడి వ్యవహారంలో అసలు దోషుల దరిదాపుల్లోకి కూడా విశాఖ పోలీసులు వెళ్లేందుకు కూటమి నేతల సంకెళ్లు అడ్డుపడుతున్నాయనే విమర్శలున్నాయి. ఇక 25 గ్రాముల కొకైన్ కేసులోనూ కీలక సూత్రధారులైన వారి నిగ్గు తేల్చకపోవడం విశాఖ పోలీసు శాఖ తీరును ప్రశ్నిస్తున్నాయి.

కీలక కేసులన్నింటిలోనూ అదే తీరు!

వాస్తవానికి విశాఖ నగరంలో కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత రోజురోజుకూ భూదందాలు, బెట్టింగ్‌లు, గంజాయి అమ్మకాలు, రౌడీషీటర్ల హత్యలు, అత్యాచారాలు పెరిగిపోతున్నాయి. మహిళలపై అఘాయిత్యాలకు అంతులేకుండా పోతోంది. అయినప్పటికీ సంఘటన జరిగిన సమయంలో హడావుడి తప్ప, అసలు వ్యవహారం వచ్చేసరికి పోలీసులు కీలక నిందితుల జోలికి వెళ్లడం లేదనే విమర్శలు బలంగా ఉన్నాయి. క్రికెట్ బెట్టింగ్ వ్యవహారం మొదలుకొని, రామానాయుడు స్టూడియో వద్ద ముసుగు వీరుల విధ్వంసం, శాంతి ఆశ్రమంలో రౌడీషీటర్ల హల్‌చల్ వంటి అనేక కీలక కేసులలో పోలీసులు కీలక సమయాల్లో వెనకడుగు వేస్తున్నట్లు తెలుస్తోంది. ప్రధాన నిందితులు బెయిల్ వచ్చే వరకు దొరకకుండా తప్పించుకోవడం అసలైన కిటుకు. ఈ వ్యవహారాలలో కూటమి పార్టీలకు చెందిన ఎమ్మెల్యేల అండదండలతో పోలీసులు కూడా అసలైన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి పట్టుకోవడం లేదని తెలుస్తోంది.

డ్రగ్స్ కేసులో దొరకని దొంగలు

ఢిల్లీ నుంచి విమానంలో దక్షిణాఫ్రికాకు చెందిన థామస్ అనే వ్యక్తి డ్రగ్స్ తీసుకొస్తున్నాడని నగర పోలీసులకు సెంట్రల్ ఏజెన్సీల నుంచి సమాచారం అందింది. సదరు వ్యక్తి కస్టమ్స్‌కు చిక్కకుండా 25 గ్రాముల కొకైన్‌ను పుస్తకాల మధ్యలో పెట్టి తీసుకొచ్చాడు. ఎయిర్‌పోర్టు నుంచి సదరు విదేశీయుడిని అనుసరించి, ఏయూ ఇంజినీరింగ్ కాలేజీ దగ్గరికి వచ్చిన తర్వాత రంగంలోకి దిగారు. అక్కడ అక్షయ్‌కుమార్ అలియాస్ మున్నా విదేశీయుడిని కలిసేందుకు వచ్చి డ్రగ్స్ ఇస్తుండగా, పోలీసులు వారిని వలపన్ని పట్టుకున్నారు. దక్షిణాఫ్రికాకు చెందిన వ్యక్తి ఫోన్‌తో పాటు మున్నా ఫోన్‌ను స్వాధీనం చేసుకున్న పోలీసులకు విస్తుపోయే నిజాలు తెలిశాయి. మున్నాను విచారించి ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. ఇందులో ఒకరు వైద్యుడు కాగా, మరొకరు కూటమి నాయకుడి కుమారుడు, మరొకరు ఉత్తరాంధ్ర కూటమి నేతల ఆర్థిక **లావాదేవీలు చూసే బడా నేత** కుమారుడని తెలుస్తోంది.

ఈ ముగ్గురిని పట్టుకోగానే కూటమికి చెం**దిన ఎమ్మెల్యే, ఎంపీలు నేరుగా పో**లీసులకు ఫోన్ **చేసి ముగ్గురిని విడిచిపెట్టాలని** ఒత్తిళ్లు చేశారనే **ఆరోపణలున్నాయి. పోలీసులపై** తీవ్ర ఒత్తిడి రావడంతో కేవలం ఇద్దరిని మాత్రమే అరెస్ట్ చేశామంటూ తొలిరోజు ప్రెస్ మీట్‌లో సీపీ వెల్లడించారు. మొత్తం ఐదుగురిని అదుపులోకి తీసుకొని ఇద్దరిని మాత్రమే ఎందుకు అరెస్ట్ చేస్తున్నారని మీడియా ప్రశ్నించగా, మిగిలిన ముగ్గురు అనుమానితులు మాత్రమేనని, నిందితులు కాదని సమాధానమిచ్చారు. అదేవిధంగా ఢిల్లీకి వెళ్లిన విచారణ బృందం కూడా కింగ్ పిన్ ప్రిన్స్‌ను పట్టుకోలేకపోయారనే విమర్శలున్నాయి. ఇక విశాఖలోని రెండు పబ్‌లలో వ్యవహారం నడుస్తుందని తెలిసినప్పటికీ, వాటిపై కూడా లోతైన విచారణ జరగకుండా ఎవరో అడ్డుపడుతున్నారనే ఆరోపణలున్నాయి.

బెట్టింగ్‌లోనూ బెయిల్ వచ్చే దాకా...!

క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్నారనే సమాచారంతో జనవరి 6వ తేదీన ఇసుకతోట, శివాజీ పాలెం, పెద్దవాల్తేరులోని గాయత్రీ టవర్స్‌లో టాస్క్‌ఫోర్స్ పోలీసులు లగుడు రవిని అదుపులోకి తీసుకున్నారు. అయితే, సదరు లగుడు రవితో పాటు మరో ఇద్దరు కూటమి ఎమ్మెల్యే అనుచరులు కూడా బెట్టింగ్‌లో ఉన్నట్టు తేలింది. వీరితో పాటు ఈ వ్యవహారాన్ని నడిపిస్తూ, నెలవారీ మామూళ్లను కూటమి ఎమ్మెల్యేకు చేరవేయడంలో కీలకంగా ఉన్న ఒక స్పెషల్ బ్రాంచ్ కానిస్టేబుల్ పాత్ర కూడా ఉంది. అయితే, సదరు కానిస్టేబుల్ జోలికి వెళ్లకుండా ఏకంగా ఇద్దరు కూటమి ఎమ్మెల్యేలు రంగంలోకి దిగినట్టు తెలుస్తోంది. నెలవారీగా భారీగా మామూళ్లు దండుకుంటున్న ఓ కూటమి ఎమ్మెల్యే అనుచరులే లక్షల్లో బెట్టింగ్‌లకు పాల్పడుతున్నారు. వీరి ముఠా విశాఖ నుంచి కాకినాడ మీదుగా హైదరాబాద్ వరకు పాకినట్టు తెలుస్తోంది. ఈ ముఠా జోలికి వెళ్లకుండా ఉండాలని ఏకంగా పోలీసులకే ఫోన్లు చేసినట్టు ఆరోపణలున్నాయి. అంతేకాకుండా, ఈ బెట్టింగ్‌లో ఉన్న కూటమి ఎమ్మెల్యే అనుచరుడు బొబ్బిలి రవికి బెయిల్ వచ్చే వరకు విశాఖ పోలీసులు అరెస్టు చేయలేదంటే, పోలీసులపై ఏ స్థాయిలో ఒత్తిళ్లు పనిచేస్తున్నాయో అర్థం చేసుకోవచ్చు.



బీచ్‌ను ఆనుకుని రామానాయుడు స్టూడియోకు సమీపంలోని ప్రైవేటు స్థలం (ఇన్‌సెట్) దుండగులు ధ్వంసం చేసిన పరికరాలు (ఫైల్)

భూకబ్జాలో తొలగని ముసుగులు

విశాఖ నగరంలో బీచ్‌కు ఆనుకుని రామానాయుడు స్టూడియోకు సమీపంలోని ప్రైవేటు స్థలంలో 20 మంది దుండగులు ముఖానికి ముసుగులు ధరించి, అక్కడున్న సీసీ కెమెరాలను ధ్వంసం చేసి, కరెంటు వైర్లు కత్తిరించారు. నంబర్ ప్లేట్లపై తెల్లకాగితం అంటించిన వాహనాలలో 20 మంది వచ్చి చిన్నపాటి దమనకాండ సృష్టించారు. రాత్రికి రాత్రే గెస్ట్ హౌస్, కాంపౌండ్ వాల్‌ను కూల్చివేసి, డెబ్రిస్‌ను కూడా లారీలల్లో మే 8వ తేదీన తరలించారు. ఈ వ్యవహారంలో టీడీపీ ఎమ్మెల్యే హస్తం ఉందనే ఆరోపణలున్నాయి. ఈ వ్యవహారంలో ఇప్పటి వరకు ముసుగు ధరించిన అసలు దొంగలను మాత్రం పోలీసులు గుర్తించలేకపోయారు. అసలు విచారణ జరగకుండా సదరు టీడీపీ ఎమ్మెల్యేనే అడ్డుకున్నారనే ఆరోపణలూ ఉన్నాయి. ఇంత యథేచ్ఛగా భూకబ్జాలకు పాల్పడుతున్నప్పటికీ పోలీసులు మాత్రం మిన్నకుండిపోవడంలో అసలు ఆంతర్యం కూటమి నేతల ఒత్తిడేనని స్పష్టమవుతోంది.

శాంతి ఆశ్రమంలో ఇంకా అశాంతే...!



శాంతి ఆశ్రమాన్ని ఆక్రమించి, సొంతంగా వ్యాపార సామ్రాజ్యాన్ని నిర్మించుకుని టీడీపీ ఎమ్మెల్యే అండదండలతో కొన్నేళ్లుగా సిద్ధార్థ, గౌతం అనే వ్యక్తులు అధికారం చెలాయిస్తున్నారు. దీనిపై కోర్టులో కేసులు నడిచి, చివరకు ఆశ్రమానికి స్థలాన్ని అప్పగించాలన్న సుప్రీంకోర్టు ఆదేశాలు రావడంతో రౌడీలు రంగంలోకి దిగారు. ఈ వ్యవహారంలో కేవలం అక్కడికి వెళ్లి గొడవకు దిగిన రౌడీషీటర్లను మాత్రమే పోలీసులు అరెస్టు చేశారు. అయితే, అసలు మొత్తం వ్యవహారాన్ని నడిపిన, శాంతి ఆశ్రమం స్థలాన్ని కబ్జా చేసి తమ ఆధీనంలో ఉంచుకున్న అసలు నిందితులకు టీడీపీ ఎమ్మెల్యే బలంగా మద్దతు ఇస్తుండటంతో వారిని అరెస్టు చేయలేదనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. బెయిల్ వచ్చే వరకు జోలికి వెళ్లలేదనే విమర్శలున్నాయి. దీనితో పాటు శాంతి ఆశ్రమం స్థలంలో నడుస్తున్న పెట్రోల్ బంకు నుంచి పోలీసు జీపులకు ఉచితంగా ప్రతీ నెలా పెట్రోల్ నింపుతుండటం మరో కారణమనే విమర్శలూ ఉన్నాయి.

డీపీఆర్ ఆమోదం లేకుండా టెండర్లు.. నిధుల్లేకుండా హడావుడి

వైజాగ్ మెట్రోకి టెండర్లు

- ఫేజ్–1లో 46.23 కిమీకు టెండర్లు పిలిచిన ఏపీ మెట్రో రైల్ కార్పొరేషన్
- డీపీఆర్‌కు కేంద్రం ఆమోదం తెలపకుండానే టెండర్లు పిలవడంపై విమర్శలు
- కేంద్రం నిధులు ఇస్తుందా లేదా అనేదానిపైనా నీలినీడలు
- గొప్పల కోసమే కూటమి ప్రభుత్వం టెండర్ల హడావుడి
- వీఎంఆర్డీఏ నిధులు మెట్రోకి మళ్లించే ప్రయత్నం
- ఇప్పటికే ఆదాయం లేక కునారిల్లుతున్న వీఎంఆర్డీఏ





డబుల్ డెక్కర్ ఫ్లైఓవర్

సాక్షి, విశాఖపట్నం: డీపీఆర్‌కు ఆమోదం చెప్పలేదు.. కేంద్రం నుంచి ఒక్క రూపాయి విదిల్చలేదు.. భూ సేకరణకు కూడా అడుగు పడలేదు.. కనీసం మా వంతు సహకారం అందిస్తామన్న హామీ కూడా రాలేదు. కానీ.. కూటమి ప్రభుత్వం ప్రచారం కోసం హడావిడి ప్రారంభించేసింది. రూపాయి లేదు.. డీపీఆర్ లేదు.. కొడుకు పేరు వైజాగ్ మెట్రో అన్నట్లుగా.. ప్రజల్ని మభ్య పెట్టేందుకు వైజాగ్ మెట్రో నిర్మాణానికి టెండర్లు ఆహ్వానించింది. ఫేజ్–1లో 46.23 కిమీ నిర్మించేందుకు టెండర్లు పిలిచిన ఏపీ మెట్రో రైల్ కార్పొరేషన్(ఏఎంఆర్‌సీ) దాదాపు రూ.6500 కోట్లు ఖర్చు చేస్తున్నట్లు స్పష్టం చేసింది. ఒక ఫ్లైఓవర్ నిర్మాణానికే రెండేళ్లకు పైగా సమయం పడుతుంది. కానీ.. 42 ఎలివేటెడ్ మెట్రో స్టేషన్లతో కూడిన 46.23 కిమీ మెట్రో ప్రాజెక్టు అగ్రిమెంట్ అయిన 30 నెలల్లో పూర్తి చేసెయ్యాలంటూ నిబంధనలు విధించింది. ఈ ప్రాజెక్టు కోసం వీఎంఆర్డీఏని ఆర్థికంగా బలి చేసేందుకు చంద్రబాబు సర్కారు నిర్ణయించింది.

విశాఖపట్నం మెట్రో రైలు ప్రాజెక్టుకు ప్రభుత్వం టెండర్లు పిలిచింది. మొదటి దశలో 46.23 కిలోమీటర్ల మేర మెట్రో రైల్ ప్రాజెక్టుకు రూ.6250 కోట్లు(జీఎస్టీ అదనం)తో టెండర్లుకు శుక్రవారం ఆహ్వానించింది. ప్రాజెక్టు మొత్తం వ్యయం రూ.11,498 కోట్లు కాగా..మూడు కారిడార్లలో ఫేజ్ -1 పనుల కోసం ఈపీసీ ప్రాతిపదికన ఏఎంఆర్‌సీ టెండర్ షెడ్యూల్ విడుదల చేసింది. ఈ పనుల్ని మూడేళ్ల కాలపరిమితితో పూర్తి చేయాలని టెండర్ షెడ్యూలులో పేర్కొన్నారు. టెండర్ సమర్పించిన 180 రోజుల వరకూ బిడ్ వ్యాలిడిటీ ఉంటుందని నోటిఫికేషన్‌లో స్పష్టం చేసింది. విశాఖపట్నం మెట్రో రైల్ ప్రాజెక్టును మొత్తం 140.13 కి.మీలో చేపట్టనున్నారు. తొలి దశలో 46.23 కిలోమీటర్ల మేర చేపట్టనుండగా.. ఇందులో మొత్తం 42 ఎలివేటెడ్ మెట్రో స్టేషన్లు రానున్నాయి. ఇందులో 20.16 కి.మీ డబుల్ డెక్కర్ తరహాలో ఫ్లైఓవర్లు నిర్మిస్తారు. మధురవాడ నుంచి తాటిచెట్లపాలెం, గాజువాక నుంచి స్టీల్‌ప్లాంట్ వరకూ పై వంతెనలు నిర్మిస్తారు. కొమ్మాది- స్టీల్‌ప్లాంట్, గురుద్వారా–పాతపోస్టాఫీసు, తాటిచెట్లపాలెం–చినవాల్తేరు కారిడార్లలో తొలి దశ కింద మెట్రోకు ప్రణాళిక చేశారు. కొమ్మాది–స్టీల్‌ప్లాంట్ మధ్య ఏర్పాటు చేసే 34.40 కిలోమీటర్ల కారిడార్లో డబుల్ డెక్కర్ ట్రాక్ నిర్మించనున్నారు. అలాగే మధురవాడ నుంచి తాటిచెట్లపాలెం వరకు 15.06 కిమీ మేర రెండో కారిడార్‌ను నిర్మిస్తారు. గాజువాక నుంచి స్టీల్‌ప్లాంటు మధ్య మరొక కారిడార్ ఏర్పాటు చేయనున్నారు.

30 నెలల్లో పూర్తి చెయ్యాలంట..

ఈ నెల 28న ఏపీ ఈప్రొక్యూర్‌మెంట్‌లో టెండర్లు పెట్టనున్నారు. సెప్టెంబర్ 12న టెండర్లు ఓపెన్ చెయ్యనున్నారు. అనంతరం వడపోత తర్వాత.. టెండర్ దక్కించుకున్న సంస్థతో అగ్రిమెంట్ కుదుర్చుకుంటారు. ఆ తర్వాత 30 నెలల్లో మొత్తం ప్రాజెక్టు పూర్తి చెయ్యాలని షరతు విధించడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఒక కిలోమీటర్ ఫ్లైఓవర్ పూర్తి చేసేందుకు రెండేళ్లకు పైగా సమయం పడుతుంది. కానీ.. కూటమి ప్రభుత్వం మాత్రం 46 కిమీ మెట్రో ప్రాజెక్టు రెండున్నరేళ్లలోనే పూర్తి చేసెయ్యాలని చెప్పడం చూస్తే.. ఇదంతా ప్రజల్ని మభ్యపెట్టి.. ప్రచారం కోసమేనన్నట్లుగా అర్థమవుతోంది. అదేవిధంగా.. డబుల్ డెక్కర్ నాలుగు లైన్ల ఫ్లై ఓవర్‌ని కూడా 24 నెలల్లో పూర్తి చేసేస్తారని చెప్పడం హాస్యాస్పదంగా ఉంది.

ఒక్క అడుగు కూడా పడకుండానే..!

ఒక ప్రాజెక్టుకు సంబంధించిన డీపీఆర్‌ని కేంద్రం ఆమోదించాలి.. నిధులు చూపించిన తర్వాతే.. టెండర్లకు వెళ్తుంటారు. కానీ.. వైజాగ్ మెట్రో విషయంలో మాత్రం తిమ్మిని బమ్మి చేసేస్తున్నారు. రాష్ట్ర కేబినెట్ డీపీఆర్‌ని ఆమోదించి.. కేంద్రానికి పంపించింది. నెల రోజుల క్రితం కూటమి ఎంపీలు కేంద్ర మంత్రిని కలిసి.. డీపీఆర్ అమోదించాలని కోరారు. కానీ.. ఇంతవరకూ డీపీఆర్‌ని ఆమోదించలేదు. అంతే కాదు.. విభజన చట్టంలో భాగంగా.. మెట్రోకు కేంద్ర ప్రభుత్వం నిధులు ఇవ్వాలి. కానీ.. ఇంతవరకూ మెట్రో కోసం నిధులు మంజూరు చేస్తామని కేంద్రం ప్రకటించలేదు. రెండు ఫేజ్‌లలో మెట్రో ప్రాజెక్టు పూర్తి చేసేందుకు 99.75 ఎకరాల భూసేకరణ చేపట్టాలి. ఇది కూడా సర్వే జరిగింది. ప్రజాభిప్రాయ సేకరణ జరుగుతోంది. భూసేకరణ ప్రక్రియ మాత్రం జరగలేదు. ఇన్ని అడ్డంకులు ఉన్నా.. టెండర్లు పిలిచి.. రెండున్నరేళ్లలో పూర్తి చేసేస్తామంటూ కూటమి ప్రభుత్వం నిస్సిగ్గుగా ప్రకటించడం హాస్యాస్పదం.

వీఎంఆర్‌డీఏపై 'ఆర్థిక' భారం.!

సంపద సృష్టించే పార్టీ తెలుగుదేశం పార్టీ అంటూ బాకాలు ఊదిన చంద్రబాబు.. అధికారంలోకి వచ్చిన ఏడాది కాలంలో అప్పుల మూటని రాష్ట్రం నెత్తిన పెట్టేశారు. ఇప్పుడు.. తన ప్రచారయావ కోసం మరోసారి వీఎంఆర్‌డీఏని బలి చేసేందుకు కుట్రపన్నుతున్నారు. ఉమ్మడి ఏపీకి సీఎంగా ఉన్న సమయంలో వీఎంఆర్‌డీఏ(అప్పటి వుడా) ఆస్తుల్ని విక్రయించి.. హైదరాబాద్ అభివృద్ధి కోసం ఖర్చు పెట్టి.. విశాఖకు రిక్త హస్తాలు చూపించారు. ఇప్పుడు.. మరోసారి వీఎంఆర్‌డీఏపై 'ఆర్థిక' భారం మోపేందుకు కూటమి సర్కారు సిద్ధమైంది. అంతంత మాత్రం ఆదాయంతో కొట్టుమిట్టాడుతున్న వీఎంఆర్‌డీఏ నుంచి రూ.4,101 కోట్లు తీసుకోవాలని నిర్ణయించింది. వాస్తవానికి వీఎంఆర్‌డీఏ వార్షిక బడ్జెట్ కేవలం రూ.1000 కోట్లు మాత్రమే. ఆదాయం లేక.. తమ ప్రాజెక్టులు పూర్తి చేయడానికే నానా యాతన పడుతున్న సమయంలో.. మొత్తం ఆస్తులు అమ్మేసి.. మెట్రోకి పెట్టాలని కూటమి సర్కారు హుకుం జారీ చేసేసింది. దీంతో.. భారీ మొత్తాన్ని ఎలా భరించాలో తెలీక అధికారులు తలలు పట్టుకుంటున్నారు. ప్రాజెక్టులో ఎలాంటి పురోగతి లేకపోయినా.. టెండర్ల పేరుతో అరచేతిలో మెట్రో చూపించేందుకు కూటమి సర్కారు సిద్ధమవడం సిగ్గు చేటని పలువురు విమర్శిస్తున్నారు.

డిసెంబర్ 26 నుంచి విశాఖ ఉత్సవ్

మహారాణిపేట: పర్యాటక శాఖ ఆధ్వర్యంలో జరగనున్న ట్రావెల్ మార్ట్ (సెప్టెంబర్ 17–19), భీమిలి ఉత్సవ్ (నవంబర్ 30), విశాఖ ఉత్సవ్ (డిసెంబర్ 26–28), ఉగాది ఉత్సవాలను (మార్చి 19, 2026) ప్రజల్లోకి తీసుకెళ్లాలని కలెక్టర్ ఎం.ఎన్. హరేందిర ప్రసాద్ సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లను కోరారు. శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అక్టోబర్ నుంచి పర్యాటకుల రాక పెరుగుతుందని, కాబట్టి ఇప్పటి నుంచే జిల్లాలోని పర్యాటక, సాంస్కృతిక ప్రాంతాలను హైలైట్ చేయాలని సూచించారు. విశాఖ పర్యాటకాన్ని డిజిటల్ మీడియా ద్వారా దేశ విదేశాలకు ప్రచారం చేయాలని కలెక్టర్ కోరారు. పర్యాటకులను ఆకర్షించడంలో సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లు క్రియాశీలకంగా పనిచేయాలని, ఇతర రాష్ట్రాలు, దేశాల ప్రజలు విశాఖ గురించి తెలుసుకుని వచ్చేలా చూడాలన్నారు. పర్యాటకంతో పాటు ప్రభుత్వం చేపడుతున్న పీ4 వంటి కార్యక్రమాలు ప్రజలకు అందే ప్రయోజనాలను కూడా తెలియజేయాలని సూచించారు. హెరిటేజ్ స్థలాలు, దేవాలయాలు, సాహస ప్రదేశాలు, ఇప్పటివరకు వెలుగులోకి రాని ప్రాంతాలపై రాబోయే 3–4 వారాల్లో ఫోటో, వీడియో పోటీలు నిర్వహించి నగదు బహుమతులు అందిస్తామని కలెక్టర్ ప్రకటించారు. విశాఖ పర్యాటక ప్రాంతాల సమగ్ర సమాచారం అందించే 'డిస్కవర్ వైజాగ్' వెబ్ పేజీని కూడా అందుబాటులోకి తెస్తున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా టూరిజం అధికారి మాధవి, హోటల్స్ యాజమాన్యం తరఫున పవన్ కార్తీక్, ఈవెంట్ మేనేజర్ వీరు మామ, పలువురు సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ పోస్టర్‌ను విడుదల చేశారు.



మాట్లాడుతున్న కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్

పలువురు రెవెన్యూ ఉద్యోగులకు బదిలీలు

మహారాణిపేట: రెవెన్యూలో పలువురు సీనియర్ అసిస్టెంట్లు, డిప్యూటీ తహసీల్దార్ల(డీటీ)కు బదిలీలు నిర్వహించారు. సీనియర్ అసిస్టెంట్లు, డిప్యూటీ తహసీల్దార్లకు మొత్తం 9 మందికి పోస్టింగులు ఇస్తూ కలెక్టర్ హరేందిర ప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు. సోషల్ ఇంపాక్టు అసెస్‌మెంటు (ఎస్ఐఏ), విశాఖపట్నం మెట్రో రైల్ ప్రాజెక్టులో పోస్టులు మంజూరు లేకపోవడంతో ఆరుగురు రెవెన్యూ సిబ్బందిని డిప్యూటేషన్ పద్ధతిలో నియమించారు.

ఏయూ పరువు తీస్తున్నారు

ఆస్పత్రిలో అభిషేక్‌ను పరామర్శించిన వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కేకే రాజు

డాబాగార్డెన్స్: ఏయూ ప్రొఫెసర్ వేధింపుల కారణంగా విద్యా సంవత్సరం నష్టపోయి ఆత్మహత్యాయత్నానికి పాల్పడి ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థి అభిషేక్‌ను వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు కేకే రాజు, తూర్పు సమన్వయకర్త మొల్లి అప్పారావు, పలువురు పార్టీ ముఖ్యనేతలు శుక్రవారం పరామర్శించారు. అభిషేక్ ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకుని, మెరుగైన వైద్యం అందించాలని కోరారు. అనంతరం అభిషేక్ తల్లిదండ్రులతో మాట్లాడి వివరాలు సేకరించారు. అభిషేక్‌కు జరిగిన అన్యాయాన్ని ఏయూ వీసీ దృష్టికి తీసుకెళ్తామని కేకే రాజు తెలిపారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ, గత కొద్ది రోజులుగా విశ్వవిద్యాలయం హాస్టల్‌లో నాణ్యత లేని భోజనం, పురుగులు కలిసిన అన్నం వల్ల విద్యార్థులు తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారని, దీనిపై విద్యార్థులు ప్రధాన గేటు వద్ద ధర్నా చేసి రాత్రంతా అక్కడే గడిపిన విషయాన్ని గుర్తు చేశారు. అభిషేక్ వంటి 95 శాతం మార్కులతో బాగా చదివే విద్యార్థికి పూర్తి అటెండెన్స్ ఉన్నప్పటికీ, అతను చేయని తప్పుకి ప్రొఫెసర్ వేధింపులు భరించలేక ఆత్మహత్యాయత్నం చేయడం విశ్వవిద్యాలయానికే చెడ్డ పేరు తెచ్చిందని రాజు ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలోనే ఎంతో పేరెన్నికగన్న ఆంధ్రా విశ్వవిద్యాలయం ప్రతిష్ట గత ఏడాదిగా దిగజారిందని ఆయన విమర్శించారు. ఏయూలో గత ఏడాదిగా జరుగుతున్న ఘటనలను పచ్చ మీడియానే ప్రచురించిందంటే విద్యా శాఖ మంత్రి లోకేష్, సీఎం చంద్రబాబు పాలనా తీరు ఏ స్థాయిలో ఉందో తెలుస్తోందన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో విద్యా వ్యవస్థ మెరుగ్గా ఉండేదని, ప్రస్తుతం కూటమి ప్రభుత్వం విద్యా వ్యవస్థను భ్రష్టు పట్టిస్తోందని కేకే రాజు ఆరోపించారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, జీవీఎంసీ వైఎస్సార్ సీపీ ఫ్లోర్‌లీడర్ బాణాల శ్రీనివాసరావు, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ అల్లు శంకరరావు, కార్పొరేటర్లు చెన్నా జానకీ రామ్, పీవీ సురేష్, బిపిన్‌కుమార్ జైన్, మహ్మద్ ఇమ్రాన్, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ద్రోణంరాజు శ్రీవత్సవ్, అనుబంధ విభాగాల అధ్యక్షులు అంబటి శైలేష్, పేడాడ రమణికుమారి, బోని అప్పలనాయుడు, సనపల రవీంద్రభరత్, బోని శివరామకృష్ణ, పులగం కొండారెడ్డి, సేనాపతి అప్పారావు, కర్రి రామారెడ్డి, రాయపురెడ్డి అనిల్‌కుమార్, వడ్డాది దిలీప్‌కుమార్, వంకాయల మారుతీప్రసాద్, జీలకర్ర నాగేంద్ర, నీలి రవి, దేవరకొండ మార్కండేయులు, పల్లా దుర్గారావు, మనలత జోబ్దాస్, ఇమంది సత్యనారాయణ, పులగం శ్రీనివాసరెడ్డి, శ్రీదేవి వర్మ, కంచుమూర్తి పద్మ శేఖర్, సంపంగి సురేష్, పులగం సూర్యనారాయణరెడ్డి, సూర్య, మహేష్, కొయ్య చిన్ని పాల్గొన్నారు.



చికిత్స పొందుతున్న అభిషేక్‌ను పరామర్శిస్తున్న వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు కేకే రాజు తదితరులు

ఏయూ విశిష్టతను కాపాడండి

మద్దిలపాలెం: ఏయూలో ఇటీవల జరుగుతున్న వరుస సంఘటనలు విశ్వవిద్యాలయం ప్రతిష్టను దిగజార్చేలా ఉన్నాయని, ఇలాంటివి పునరావృత్తం కాకుండా చర్యలు తీసుకోవాలని ఏయూ ఉపకులపతి ఆచార్య జి.పి. రాజశేఖర్‌ను వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కేకే రాజు కోరారు. ఏయూ విద్యార్థి ఆత్మహత్యాయత్నం, భోజనంలో పురుగులు రావడంతో విద్యార్థులు ఆందోళన చేపట్టిన నేపథ్యంలో, శుక్రవారం వైఎస్సార్‌సీపీ నాయకుల బృందం ఆత్మహత్యాయత్నం చేసిన విద్యార్థిని కేజీహెచ్‌లో పరామర్శించింది. అనంతరం ఏయూ వీసీని కలిసి విశ్వవిద్యాలయంలో నెలకొన్న సమస్యలపై వినతి పత్రం అందజేశారు. వీసీ చాంబర్‌లోకి వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లను, సీనియర్ నాయకులను అనుమతించకపోవడంపై కేకే రాజు వీసీ తీరును తప్పుపట్టారు. ప్రజా ప్రతినిధులను అనుమతించకపోవడం దారుణమైన చర్య అని పేర్కొన్నారు. దీనికి వీసీ, అలాంటిదేమీ లేదు, అందరూ రావచ్చని బదులిచ్చారు.

దేవుడి పేరిట దోపిడీ

- అయోధ్య మందిరం సెట్ పేరుతో మోసం
- సిబ్బందికి బిల్లులు ఎగ్గొట్టడంతో వాయిస్ రికార్డులతో వెలుగులోకి వాస్తవాలు

ఏయూక్యాంపస్: హిందువుల ఆధ్యాత్మికతను, ట్రెండింగ్‌లో ఉన్న అయోధ్య రాముడిని ఆధారంగా చేసుకొని బీచ్ రోడ్డులో ఏర్పాటు చేసిన గరుడ అయోధ్య రామాలయం నమూనా నిర్వాహకులు భారీ మోసానికి పాల్పడినట్టు వెల్లడైంది. దేవుడి పేరుతో వ్యాపారం చేస్తూ, ఆలయాలను, దేవుడిని వ్యాపార వస్తువులుగా మార్చుకున్నారని ఆరోపణలు వస్తున్నాయి. రెండు నెలలపాటు ఈ వ్యాపారం ద్వారా కోట్లాది రూపాయలు సంపాదించిన వీరు, ఆశతో రామకల్యాణం పేరుతో ప్రజల నుంచి భారీగా డబ్బులు వసూలు చేయాలని ప్రణాళిక రచించారు. సింహాచలం గిరి ప్రదక్షిణను సైతం తమ ప్రచారానికి వాడుకున్నారు.

సోషల్ మీడియాలో లీకైన వాయిస్ రికార్డులు

లక్షలాది మంది ప్రజలు పొరుగు జిల్లాల నుంచి గిరి ప్రదక్షిణకు వస్తారని గుర్తించిన నిర్వాహకులు.. దాదాపు 250 ఫ్లెక్సీలు, 5 వేల పోస్టర్లతో రామకల్యాణంపై విస్తృత ప్రచారం చేశారు. అయితే తమ ప్రచారానికి ఉపయోగపడిన సోషల్ మీడియానే తమ తప్పులను సైతం బయటపెడుతుందని నిర్వాహకులు ఊహించలేదు. ఆలయం వద్ద సిబ్బందికి, నిర్వాహకుడికి మధ్య జరిగిన సంభాషణలు తాజాగా బయటకు రావడంతో వారి పన్నాగం బట్టబయలైంది. తన వద్ద పనిచేస్తున్న సిబ్బందికి, సేవలు అందించిన వారికి బిల్లులు ఇవ్వకుండా నిర్వాహకులు ఎగ్గొట్టారు. దీంతో నిర్వాహకుడికి, వ్యాపారస్తుడికి మధ్య జరిగిన సంభాషణ వెలుగులోకి వచ్చింది. ఈ సంభాషణలో స్వయంగా పోస్టర్లు తామే ముద్రించి ప్రచారం చేశామని నిర్వాహకుడు అంగీకరించాడు. నగరవ్యాప్తంగా 250 ఫ్లెక్సీలు, 5 వేల పోస్టర్లు అతికించామని నిర్వాహకుడు చెప్పడం విశేషం. నగరంలోని రామాలయాల వద్ద కూడా ప్రచారం చేయాలని, రామభక్తులను తమ గుడికి ఆహ్వానించాలని వీరు మాట్లాడుకున్నారు. ఒక్కొక్కరి నుంచి రూ. 2,999 కల్యాణం రుసుము రూపంలో వసూలు చేసి, వేలాది మందితో దీనిని నిర్వహించి లక్షలాది రూపాయలు ఒక్క రోజులో సంపాదించాలని పక్కాగా ప్లాన్ చేశారు.



నిస్సిగ్గుగా అబద్ధాలు, వెలుగులోకి వాస్తవాలు

భద్రాచలం దేవస్థానం ఈవో విశాఖ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో నిర్వాహకులు తమ తప్పును కప్పిపుచ్చుకునే ప్రయత్నం చేశారు. వెంటనే ఒక హోటల్‌లో విలేకరుల సమావేశం పెట్టి పోస్టర్లు తాము ముద్రించలేదని, ఎవరో గిట్టని వారు చేసిన పని అని చెప్పారు. దీనిపై తాము పోలీసులను ఆశ్రయిస్తామన్నారు. సాధు పరిషత్ సభ్యులు సైతం ఆలయాన్ని సందర్శించినప్పుడు నిర్వాహకులు, వారి అనునాయులు పోస్టర్లు తాము ముద్రించలేదని చెప్పారు. అయితే తాజాగా బయటపడిన వాయిస్ రికార్డులను బట్టి నిర్వాహకుడే ఉద్దేశపూర్వకంగా భక్తి పేరుతో వ్యాపారం చేసినట్లు స్పష్టమవుతోంది. జూలై 9న జరిగిన గిరి ప్రదక్షిణలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు, పోస్టర్లు తమవి కావని చెబుతున్న నిర్వాహకులు వెంటనే పోలీసులకు ఎందుకు ఫిర్యాదు చేయలేదనే ప్రశ్న ఉత్పన్నమవుతోంది. అలాగే పోస్టర్లలో ముద్రించిన ఫోన్ నంబర్లు ఎవరివి, ఆ నంబర్లు ఎవరి పేరుమీదుగా రిజిస్టర్ అయ్యాయనే దిశగా విచారణ జరిపితే మరిన్ని వాస్తవాలు బయటపడే అవకాశం ఉంది.



అధికారుల ఉదాసీనతపై విమర్శలు

గరుడ అయోధ్య రామమందిరం నమూనా ఏర్పాటు జరిగిన నాటి నుంచి వివిధ విభాగాల అధికారుల ఉదాసీనత బయటపడుతోంది. జీవీఎంసీ, ఫైర్ సేఫ్టీ, దేవదాయ శాఖ, పోలీసులు, జీఎస్టీ అధికారులు ఈ విషయంపై దృష్టి సారించారా లేదా అనే విషయాలు వెలుగులోకి రావాల్సి ఉంది. నిర్వాహకులు తాత్కాలిక జీఎస్టీ నంబరు తీసుకున్నారా, టికెట్లకు సంబంధించిన ఆర్థిక లావాదేవీలు ఎంతవరకు చూపించారు, నగదు రూపంలో అమ్మిన టికెట్లను లెక్కల్లో చూపించారా, జీఎస్టీ ఎంతవరకు చెల్లించారు అనే విషయాలపై పూర్తిస్థాయిలో విచారణ జరిపితే వాస్తవాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

నేడు జెడ్పీ స్థాయీ సంఘాల సమావేశాలు

మహారాణిపేట: జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జె.సుభద్ర అధ్యక్షతన శనివారం జెడ్పీ స్థాయీ సంఘ సమావేశాలు నిర్వహిస్తున్నట్లు సీఈవో పి.నారాయణమూర్తి తెలిపారు. ఉదయం 10 గంటలకు 2, 5, 11 గంటలకు 3, 4, మధ్యాహ్నం 12 గంటలకు 1, 6, 7వ స్థాయీ సంఘ సమావేశాలు జరుగుతాయని పేర్కొన్నారు. జెడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీలు, సంబంధించిన ప్రగతి నివేదికలతో అధికారులు ఈ సమావేశాలకు హాజరుకావాలని కోరారు.

కోరాపుట్ వరకే కిరండూల్ రైళ్లు

తాటిచెట్లపాలెం: విశాఖపట్నం–కిరండూల్–విశాఖపట్నం మధ్య నడిచే ప్రయాణికుల రైళ్లు భద్రతా పనుల నిమిత్తం కోరాపుట్ వరకు మాత్రమే రాకపోకలు సాగిస్తాయని వాల్తేర్ డివిజన్ అధికారులు తెలిపారు. ఈ నెల 26(శనివారం), 27వ తేదీల్లో విశాఖపట్నం–కిరండూల్ (18515) నైట్ ఎక్స్‌ప్రెస్ కోరాపుట్ వరకు మాత్రమే నడుస్తుంది. ఈ నెల 27, 28వ తేదీల్లో కిరండూల్–విశాఖపట్నం(18516) నైట్ ఎక్స్‌ప్రెస్ కోరాపుట్ నుంచి బయలుదేరి విశాఖపట్నం చేరుకుంటుంది.

- ఈ నెల 27, 28వ తేదీల్లో విశాఖపట్నం–కిరండూల్ (58501) పాసింజర్ కోరాపుట్ స్టేషన్ వరకు మాత్రమే నడుస్తుంది. తిరుగు ప్రయాణంలో కిరండూల్–విశాఖపట్నం(58502) పాసింజర్ కోరాపుట్ నుంచి బయలుదేరి విశాఖపట్నం చేరుకుంటుంది. ప్రయాణికులు ఈ మార్పులు గమనించాలని అధికారులు సూచించారు.

పలు రైళ్ల దారి మళ్లింపు

తాటిచెట్లపాలెం: అరక్కోణం జంక్షన్ పరిధిలో జరుగుతున్న నాన్ ఇంటర్‌లాకింగ్ పనుల కారణంగా ఈ మార్గంలో నడిచే పలు రైళ్లను దారి మళ్లిస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. సెప్టెంబరు 12, 19, 26వ తేదీల్లో జసిద్ది–ఎస్ఎంవీటి బెంగళూరు(22306) వీక్లీ సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్, సెప్టెంబరు 13, 20, 27వ తేదీల్లో ఎస్ఎంవీటి బెంగళూరు–కామాఖ్య ఏసీ సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్, సెప్టెంబర్ 13, 16, 22, 23వ తేదీల్లో అగర్తలా–ఎస్ఎంవీటి బెంగళూరు(12504) హమ్‌సఫర్ ఎక్స్‌ప్రెస్, సెప్టెంబరు 16, 19, 23, 26వ తేదీల్లో ఎస్ఎంవీటి బెంగళూరు–అగర్తలా (12503) హమ్‌సఫర్ ఎక్స్‌ప్రెస్ వయా గూడూరు, రేణిగుంట జంక్షన్, తిరుత్తని, మెల్పక్కం, కాట్పడి జంక్షన్ స్టేషన్‌లో మీదుగా నడుస్తాయి. ప్రయాణికుల సౌకర్యార్థం తిరుత్తని జంక్షన్‌లో అదనపు హాల్ట్‌ను కేటాయించారు.

ఏపీఎస్ఆర్టీసీలో అప్రెంటీస్‌షిప్

డాబాగార్డెన్స్: పలు ట్రేడుల్లో ఐటీఐ ఉత్తీర్ణులైన అభ్యర్థుల నుంచి అప్రెంటీస్‌షిప్ కోసం ఏపీఎస్ఆర్టీసీ దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. విజయనగరంలోని ప్రాంతీయ శిక్షణ కార్యాలయ ప్రిన్సిపాల్ ఓ ప్రకటనలో ఈ విషయం తెలిపారు. అర్హులైన అభ్యర్థులు www. apprenticeshipindia. gov. in లో తమ పేర్లను నమోదు చేసుకోవాలి. శనివారం దరఖాస్తు ప్రక్రియ ప్రారంభమై.. ఆగస్టు 9వ తేదీతో ముగుస్తుంది. మరిన్ని వివరాలకు కార్యాలయ పని వేళల్లో 08922–294906లో సంప్రదించవచ్చు.

ఉద్యోగే దొంగ

- భారీ చోరీ కేసును ఛేదించిన ద్వారకా పోలీసులు
- రూ.1,29,48,154 విలువైన చోరీ సొత్తు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన సీపీ శంఖబ్రత బాగ్చి

తాటిచెట్లపాలెం: ఒక డైమండ్స్ షోరూంలో సేల్స్ ఎగ్జిక్యూటివ్‌గా పని చేస్తున్న ఉద్యోగి.. యజమాని నమ్మకాన్ని దుర్వినియోగం చేసి ఆభరణాలను దొంగిలించాడు. ద్వారకా పోలీసులు ఈ భారీ చోరీ కేసును ఛేదించి.. ఇద్దరు నిందితులను పట్టుకున్నారు. వారి నుంచి రూ.1,29,48,154 విలువైన చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసుకు సంబంధించి నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి శుక్రవారం తన కార్యాలయంలో మీడియాకు వెల్లడించిన వివరాలివి. హైదరాబాద్‌కు చెందిన బొంగు వంశీ.. అక్కడి క్రిష్ డైమండ్స్ షోరూంలో సేల్స్ ఎగ్జిక్యూటివ్‌గా పనిచేస్తున్నాడు. ఇదే షోరూంలో ఆరు నెలల కిందట హైదరాబాద్ ప్రాంతానికి చెందిన ముదపాక జేజీ మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్‌గా చేరాడు. షోరూంలో తయారైన వివిధ రకాల డైమండ్ మోడళ్లను విశాఖ తీసుకొచ్చి.. ఇక్కడి దుకాణ యజమానులకు వాటిని చూపించి ఆర్డర్‌లు తీసుకు వెళ్తుంటారు. ఈ క్రమంలో ఈ నెల 2న క్రిష్ డైమండ్స్ మేనేజింగ్ డైరెక్టర్ అనూప్ అగర్వాల్ 883.814 గ్రాముల 18 క్యారెట్స్ బంగారం, డైమండ్ ఆభరణాలు, 22.881 గ్రాముల 22 క్యారెట్స్ బంగారం, డైమండ్స్ ఆభరణాలు(మొత్తం 906.695 గ్రాములు.. వీటి విలువ రూ.1,29,48,154.62) ఇచ్చి.. బొంగు వంశీని, ముదపాక జేజీని విశాఖ పంపించారు. వీరు ఈ నెల 2న హైదరాబాద్‌లో బయలుదేరి 3న విశాఖ చేరుకున్నారు. ఎప్పటిలాగే లలితా జ్యువెలరీ ఎదురుగా ఉన్న సాయి శ్రీనివాస రెసిడెన్సీలో దిగారు. అక్కడి నుంచి నగరంలోని పలు షోరూంలలో మోడల్స్ చూపించి 3వ తేదీ రాత్రి 8.50 గంటలకు హోటల్‌కు చేరుకున్నారు. ఆభరణాలతో ఉన్న బ్యాగ్‌ను కబోర్డులో పెట్టి నిద్రించారు. 4వ తేదీ తెల్లవారుజాము 4.30 సమయంలో వంశీని లేపి వాకింగ్‌కు వెళ్తున్నట్లు జేజీ చెప్పగా.. బయట నుంచి గదికి తాళం వేసి వెళ్లి రమ్మని వంశీ అన్నాడు. తర్వాత నిద్రలేచి చూసేసరికి జేజీ కనిపించలేదు. ఫోన్ స్విచాఫ్ వచ్చింది. కబోర్డు పరిశీలించగా అందులో ఉన్న ఆభరణాల బ్యాగు, జేజీ వెంట తెచ్చుకున్న లగేజీ బ్యాగు కూడా కనిపించలేదు. ఈ విషయాన్ని వెంటనే హైదరాబాద్‌లోని షోరూం హెచ్ఆర్ సూరజ్‌కుమార్‌కు తెలిపాడు. హోటల్ సీసీటీవీ ఫుటేజీలను పరిశీలించగా ఉదయం 4.30కు వాకింగ్‌కు వెళ్లిన జేజీ మళ్లీ 5.47కు తిరిగి వచ్చి.. రెండు బ్యాగులను తీసుకెళ్లినట్లు తేలింది. ఈ ఘటనపై ద్వారకా పోలీస్‌స్టేషన్‌లో వంశీ ఫిర్యాదు చేశాడు.



కేసు వివరాలను వెల్లడిస్తున్న సీపీ బాగ్చి

మొబైల్ సిగ్నల్స్ ఆధారంగా..

అప్పటి నుంచి కేసు దర్యాప్తు చేస్తున్న ద్వారకా పోలీసులు.. మొబైల్ సిగ్నల్స్ ద్వారా శుక్రవారం రైల్వే స్టేషన్ పరిసరాల్లో జేజీ ఉన్నట్లు గుర్తించారు. అక్కడ అనుమానాస్పదంగా కనిపించిన ఇద్దరు వ్యక్తులను అనుసరించారు. పోలీసులను చూసిన వారు పారిపోయేందుకు ప్రయత్నించగా.. వెంబండించి అదుపులోకి తీసుకున్నారు. మధ్యవర్తుల సమక్షంలో వారి బ్యాగును పరిశీలించి, విచారించగా.. వారు ముదపాక జేజీ, ఆకుల సత్యనారాయణగా తేలింది. బ్యాగ్‌లో జేజీ దొంగలించిన ఆభరణాలు ఉన్నట్లు గుర్తించి.. అదుపులోకి తీసుకున్నారు. ఆకుల సత్యానారయణ జేజీకి పార్ట్‌నర్. జేజీ దొంగలించిన ఆభరణాలను ఆయన వద్దే ఉంచాడు. దీనిపై ఇంకా విచారణ జరుగుతున్నట్లు సీపీ తెలిపారు. చాకచక్యంగా వ్యవహరించి కేసును ఛేదించిన ద్వారకా సీఐ(ఇన్‌చార్జి) సీహెచ్ ఉమాకాంత్, సీఐ డీవీ రమణ, సబ్ ఇన్‌స్పెక్టర్లు జె.ధర్మేంద్ర, అసిరి తాత, హెడ్ కానిస్టేబుళ్లు వెంకటరమణ, కె.టి.వి.రమేష్, కానిస్టేబుళ్లు ఎం.నాగరాజు, ఎస్.రమేష్‌లను కమిషనర్ అభినందించారు.

రాష్ట్రంలో అరాచకపాలన



మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ విశాఖ జిల్లా అధ్యక్షుడు బాజినాయుడు

వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ నాయకుల ధ్వజం

సాక్షి, విశాఖపట్నం: రాష్ట్రంలో అరాచక పాలన సాగుతోందని వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ విశాఖ జిల్లా అధ్యక్షుడు బాజి నాయుడు మండిపడ్డారు. కూటమి ఏడాది పాలనలో ప్రజాస్వామ్యాన్ని తూట్లు పొడుస్తూ 'రెడ్ బుక్' రాజ్యాంగాన్ని అమలు చేస్తోందన్నారు. మద్దిలపాలెంలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ప్రశ్నించే గొంతులను నొక్కేందుకు వైఎస్సార్ సీపీ ప్రజా ప్రతినిధులు, మాజీ మంత్రులపై అరెస్టులు, దాడులు జరుగుతున్నాయని ఆరోపించారు. లిక్కర్ స్కామ్ పూర్తిగా కల్పితమని, రాజంపేట ఎంపీ మిథున్ రెడ్డి అరెస్టును ఖండిస్తున్నట్లు తెలిపారు. కూటమి ప్రభుత్వం వచ్చాక విశాఖలో మాదకద్రవ్యాల వినియోగం, హత్యలు, మహిళలపై అఘాయిత్యాలు, దోపిడీలు పెరిగి శాంతిభద్రతలు లోపించాయని ఆవేదన వ్యక్తం చేశారు. శాంతిభద్రతలపై దృష్టి సారించేలా పోలీసులకు ప్రత్యేక అధికారాలు ఇవ్వాలని గవర్నర్‌ను కోరారు. లీగల్ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి పాకా సత్యనారాయణ మాట్లాడుతూ ఎన్నికల హామీలు అమలు కాలేదని, వైఎస్సార్ సీపీ నేతలపై కక్షపూరిత దాడులు, కేసులను ఖండించారు. లీగల్ సెల్ జిల్లా మాజీ అధ్యక్షుడు కరణం కృష్ణ మాట్లాడుతూ కూటమి పాలనలో మద్యం విక్రయాలు విచ్చలవిడిగా పెరిగాయని, పచ్చ పత్రికల్లో రాసిన కథనాల ఆధారంగా సిట్ దర్యాప్తు సాగుతోందని ఆరోపించారు. లా నేస్తం కింద జూనియర్ లాయర్లకు గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం నెలకు రూ.5,000 స్టైఫండ్ ఇచ్చిందని, కూటమి ప్రభుత్వం రూ 10,000 ఇస్తామని చెప్పి ఏడాదైనా ఇవ్వలేదన్నారు. లీగల్ సెల్ రాష్ట్ర సెక్రటరీ వుడా శ్రీనివాసరావు మాట్లాడుతూ లిక్కర్ స్కాం 2014–19 మధ్య జరిగిందని ఆరోపించారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ప్రభుత్వ ఆధీనంలో మద్యం విక్రయించి ఆదాయాన్ని పెంచుతూ, వినియోగాన్ని నియంత్రించారని తెలిపారు. సమావేశంలో లీగల్ సెల్ నాయకులు వాగుపల్లి చిన్నారావు, దాసరి గణేష్, సీఐ సత్యనారాయణ, మొల్లి రామారావు, ఆర్ఎస్ రవి, మొల్లి సింహాద్రి, సూరిశెట్టి అనిల్, సియాద్రి రవి, సూరిశెట్టి శ్రీనివాసరావు, ఆకెళ్ల వెంకటరమణ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

శ్రావణం.. శుభకరం

జిల్లాలో వెల్లివిరిసిన శ్రావణ శోభ

శ్రావణ మాసం తొలి శుక్రవారం సందర్భంగా విశాఖ.. ఆధ్యాత్మిక శోభతో వెల్లివిరిసింది. నగరంలోని ప్రముఖ ఆలయాలన్నీ తెల్లవారు జాము నుంచే భక్తులతో కిటకిటలాడాయి.

కనకమహాలక్ష్మి ఆలయంలో..

డాబాగార్డెన్స్: కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో శ్రావణలక్ష్మి పూజలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. స్థానిక ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ పూజలను ప్రారంభించారు. ముందుగా గణపతి పూజ నిర్వహించి, అనంతరం అమ్మవారికి విశేష పూజలు జరిపారు. వేదమంత్రాల మధ్య, నాదస్వర సుస్వరాలతో ఉదయం 8.20 గంటలకు శ్రావణలక్ష్మి పూజలు ప్రారంభమయ్యాయి. ఈ పూజలో ఉభయదాతలు రెండు బ్యాచ్‌లుగా పాల్గొన్నారు. దేవస్థానం ఈవో కె. శోభారాణి మాట్లాడుతూ శ్రావణ మాసం సందర్భంగా నెల రోజులు జరిగే పూజలకు అవసరమైన పూజా సామగ్రిని దేవస్థానమే సమకూరుస్తుందన్నారు. ప్రత్యేక పూజలో పాల్గొనదలచిన భక్తులు రూ.400 చెల్లించి తమ పేర్లను నమోదు చేసుకోవచ్చు.

ముత్యాల చీరలో కన్యకాపరమేశ్వరి

డాబాగార్డెన్స్: కురుపాం మార్కెట్ సమీపంలోని కన్యకాపరమేశ్వరి ఆలయంలో శుక్రవారం శ్రావణ మాసం తొలి శుక్రవారం సందర్భంగా ప్రత్యేక పూజలు జరిగాయి. అమ్మవారు ముత్యాల చీర అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. వేకువజామున 5 గంటలకు అమ్మవారి మూలవిరాట్‌కు శుద్ధజలం, పాలు, పెరుగు, తేనె, గంధం, పసుపు, కుంకుమ, వివిధ రకాల పండ్ల రసాలు, అలాగే 108 ద్రవ్యాలతో అభిషేకాలు నిర్వహించారు. అమ్మవారికి ముత్యాల చీరతో అలంకరించి, 108 బంగారు పుష్పాలతో ప్రత్యేక నివేదన సమర్పించారు. ఆలయ ప్రాంగణంలో మహిళలు సామూహిక లలితా సహస్రనామ పారాయణం నిర్వహించారు. ఆస్థాన పురోహితులు ఆర్‌బీబీ కుమారశర్మ నేతృత్వంలో 250 మంది మహిళలతో సామూహిక కుంకుమ పూజలు జరిగాయి. కార్యక్రమంలో ఆలయ సంఘ అధ్యక్షుడు ఆరిశెట్టి దినకర్, కార్యదర్శి పెనుగొండ కామరాజు, శ్రావణమాస ఉత్సవ కార్య నిర్వాహక సభ్యులు పాల్గొన్నారు.



శ్రావణలక్ష్మి పూజల్లో పాల్గొన్న ఉభయదాతలు

సింహవల్లీ తాయారుకు లక్ష కుంకుమార్చన

సింహాచలం: శ్రావణ శుక్రవారం సందర్భంగా సింహగిరిపై కొలువైన శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయంలోని సింహవల్లీ తాయారు అమ్మవారికి లక్ష కుంకుమార్చన పూజను వైభవంగా నిర్వహించారు. సింహవల్లీ తాయారు, చతుర్భుజ తాయారు అమ్మవార్ల ఉత్సవమూర్తులను ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక వేదికపై అధిష్ఠింపజేసి, ఉదయం 7 గంటల నుంచి 9 గంటల వరకు లక్ష నామాలతో అమ్మవార్లకు కుంకుమ పూజ చేశారు. ఈ పూజలో పాల్గొన్న భక్తులకు శేషవస్త్రాలు, కుంకుమ ప్రసాదంగా అందజేశారు. అలాగే, సాయంత్రం అమ్మవారికి ఆలయ బేడా మండపంలో తిరువీధి సేవను వైభవంగా నిర్వహించారు. అనంతరం సహస్రనామార్చన పూజ చేపట్టారు. ఆలయ స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, ప్రధానార్చకుడు కరి సీతారామాచార్యులు, ఇతర అర్చకులు, పారాయణదారులు ఈ పూజలను నిర్వహించారు. ఆలయ ఏఈవో తిరుమలేశ్వరరావు ఏర్పాట్లను పర్యవేక్షించారు.



సింహవల్లీ తాయారు అమ్మవారికి లక్ష కుంకుమార్చన నిర్వహిస్తున్న అర్చకులు



లక్ష కుంకుమార్చనలో పాల్గొన్న భక్తులు

విశాఖలో హైకోర్టు బెంచ్ ఏర్పాటు చేయాలి

విశాఖ లీగల్: విశాఖలో హైకోర్టు బెంచ్‌ను తక్షణమే ఏర్పాటు చేయాలని ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ రాష్ట్ర అధ్యక్షుడు కె.సురేష్‌కుమార్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఉదయం రాష్ట్ర వ్యాప్తంగా అన్ని న్యాయస్థానాల వెలుపల అసోసియేషన్ ఆధ్వర్యంలో ధర్నా జరిగింది. విశాఖలో జరిగిన ధర్నాలో పాల్గొన్న రాష్ట్ర అధ్యక్షుడు కె.ఎస్.ఎస్. సురేష్‌కుమార్ మాట్లాడుతూ న్యాయవాదుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. న్యాయవాదుల రక్షణ చట్టంలో మార్పులు, నూతన న్యాయస్థానాల నిర్మాణం, ఖాళీగా ఉన్న న్యాయమూర్తుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేయాలన్నారు. మహిళా న్యాయవాదులకు విశ్రాంతి గదులు ఏర్పాటు చేయాలని, న్యాయవాదుల మరణానంతరం ప్రయోజనాలను రూ.6 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచాలని విజ్ఞప్తి చేశారు. అలాగే జూనియర్ న్యాయవాదులకు రూ.10వేల గౌరవ భృతిని కల్పించాలని, విశాఖపట్నంలో రైల్వే ట్రిబ్యునల్ ఏర్పాటుకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం న్యాయవాదుల బృందం డీఆర్వో భవానీశంకర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు ఎం.ఎస్. భగవతి, అజయ్ కుమార్, ఇందిర, శైలజ, పి.మాధురి, వేణు సుబ్రహ్మణ్యం, జి.సుశీల, వి.ఆర్.ఝాన్సీ, అధిక సంఖ్యలో న్యాయవాదులు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న న్యాయవాదులు

మరణించి.. మరో నలుగురికి వెలుగునిచ్చి..

నేత్రదానంతో మానవత్వాన్ని చాటుకున్న రమేష్ కుటుంబం

పెందుర్తి: పొట్ట చేత పట్టుకుని వలస వచ్చిన ఓ ఎలక్ట్రీషియన్‌ను మృత్యువు కబళించినా, అతడు మరణానంతరం నలుగురికి చూపునిచ్చి వెలుగునింపాడు. గుండెపోటుతో మరణించిన ఆ వ్యక్తి నేత్రాలను దానం చేసి, అతని కుటుంబం గొప్ప మానవత్వాన్ని చాటుకుంది. ఏలూరుకు చెందిన 34 ఏళ్ల మీరపురెడ్డి రమేష్ వృత్తి రీత్యా ఎలక్ట్రీషియన్. నెల రోజుల కిందట పెందుర్తి మండలం అక్కిరెడ్డిపాలెంలోని ఒక కంపెనీలో పనికి కుదిరాడు. గురువారం రాత్రి విధులు ముగించుకుని తన గదికి వచ్చిన రమేష్‌కు తీవ్రమైన గుండెపోటు రావడంతో పాటు ఫిట్స్ వచ్చి అక్కడికక్కడే మరణించాడు. ఈ క్రమంలో రమేష్ మృతదేహాన్ని తరలించేందుకు ఫ్రీజర్ బాక్స్ కోసం పెందుర్తిలోని సాయి హెల్పింగ్ హ్యాండ్స్ ప్రతినిధి దాడి శ్రీనివాస్‌ను కుటుంబ సభ్యులు సంప్రదించారు. శ్రీనివాస్ చొరవ తీసుకుని, రమేష్ కళ్లు దానం చేస్తే మరో నలుగురికి కంటి చూపు వస్తుందని కుటుంబ సభ్యులను ఒప్పించారు. రమేష్ తల్లి చంటమ్మ, సోదరుడు మహేష్ అంగీకరించడంతో.. వెంటనే అక్కడికి చేరుకున్న ఎల్.వి.ప్రసాద్ సారథ్యంలోని మోషన్ ఐ బ్యాంక్ ప్రతినిధులు నగేష్ నేత్రాలను సేకరించి, సురక్షితంగా ఆసుపత్రికి తరలించారు. పుట్టెడు దుఃఖంలోనూ రమేష్ కుటుంబ సభ్యులు చూపిన మానవత్వంపై స్థానికంగా ప్రశంసలు వెల్లువెత్తాయి.



రమేష్ కళ్లు దానం చేస్తూ అంగీకారం తెలుపుతున్న అతని సోదరుడు మహేష్, రమేష్(ఫైల్)

6వ తరగతి ప్రవేశ దరఖాస్తులకు 29 చివరి తేదీ

కొమ్మాది: జవహర్ నవోదయ విద్యాలయంలో 2026–27 విద్యా సంవత్సరానికి 6వ తరగతి ప్రవేశ పరీక్ష దరఖాస్తు గడువు ఈ నెల 29తో ముగుస్తుందని విద్యాలయ ప్రిన్సిపల్ డా. వై.ఎస్.ఎస్.చంద్రశేఖర్ తెలిపారు. జిల్లాలో 5వ తరగతి చదువుతున్న విద్యార్థులు నవోదయ విద్యాలయ సమితి వెబ్‌సైట్‌లో దరఖాస్తు ఫారాన్ని నింపి అప్‌లోడ్ చేయాలి. అలాగే అభ్యర్థి ఫొటో, సంతకం, 3, 4, 5 తరగతులు చదివిన పాఠశాల వివరాలతో కూడిన సంబంధిత ఫారాన్ని నింపి, ప్రధానోపాధ్యాయుడిచే ధ్రువీకరణ చేయించి అప్‌లోడ్ చేయాలి.

విశాఖ ఎక్స్‌ప్రెస్‌కు ఎల్‌హెచ్‌బీ కోచ్‌లు

తాటిచెట్లపాలెం: సికింద్రాబాద్–భువనేశ్వర్ న్యూ– సికింద్రాబాద్ మధ్య నడిచే విశాఖ ఎక్స్‌ప్రెస్‌కు ఎల్‌హెచ్‌బీ కోచ్‌లను జతచేస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. సికింద్రాబాద్–భువనేశ్వర్ న్యూ(17016) విశాఖ ఎక్స్‌ప్రెస్ సెప్టెంబరు 23 నుంచి, భువనేశ్వర్ న్యూ–సికింద్రాబాద్(17015) విశాఖ ఎక్స్‌ప్రెస్ సెప్టెంబరు 25 నుంచి ఎల్‌హెచ్‌బీ కోచ్‌లతో నడుస్తాయని వెల్లడించారు.

జీతాల కోసం నేడు ఉపాధ్యాయుల నిరసన

విశాఖ విద్య: ఉపాధ్యాయులకు సకాలంలో జీతాలు చెల్లించాలనే డిమాండ్‌తో యూటీఎఫ్ జిల్లా విభాగం శనివారం సాయంత్రం 5 గంటలకు డీఈవో కార్యాలయం ముందు నిరసన కార్యక్రమం చేపట్టనుంది. ఈ విషయాన్ని యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దాసరి నాగేశ్వరరావు, టీ.ఆర్. అంబేడ్కర్ శుక్రవారం ఎన్ఏడీలోని యూటీఎఫ్ కార్యాలయంలో వెల్లడించారు. బదిలీలు పూర్తయి రెండో నెల గడుస్తున్నా ఉపాధ్యాయుల పొజిషన్ ఐడీలు రాకపోవడంతో జీతాలు అందలేదని నాయకులు తెలిపారు.

ఆల్ ఇండియా అండర్–16 ఫుట్‌బాల్ టోర్నీకి భాగ్యేష్


తగరపువలస: మధ్యప్రదేశ్‌లోని బాలాఘాట్‌లో ఈ నెల 26 నుంచి జరుగనున్న ఆల్ ఇండియా ఫుట్‌బాల్ జూనియర్ బాలుర అండర్–16 బీసీ రాయ్ ట్రోఫీ టోర్నమెంట్‌కు కోలా భాగ్యేష్ ఎంపికయ్యాడు. మదనపల్లెలో జరిగిన రాష్ట్ర స్థాయి ఫుటబాల్ పోటీల్లో పాల్గొని ప్రతిభ చూపాడు. అలాగే చిట్టివలస బంతాట మైదానంలో జరిగిన శిక్షణ తరగతుల్లో కూడా భాగ్యేష్ పాల్గొన్నాడు. భాగ్యేష్‌ను చిట్టివలస పోలమాంబ జట్టుతో పాటు జిల్లా అసోసియేషన్ కార్యదర్శి అక్కరమాని చినబాబు అభినందించారు.

సాయుధ దళాల పరాక్రమం ఆపరేషన్ సిందూర్

సింథియా: ఆపరేషన్ సిందూర్‌పై డిఫెన్స్ లెక్చర్ కమ్ ప్రెజెంటేషన్ కార్యక్రమం సముద్రిక ఆడిటోరియంలో కెప్టెన్ రాజశేఖర్ నేతృత్వంలో శుక్రవారం జరిగింది. పహల్గాంలో జరిగిన ఊచకోతకు వ్యతిరేకంగా భారతీయ సాయుధ దళాల ధైర్యం, వ్యూహాత్మక పరాక్రమానికి ఆపరేషన్ సిందూర్ నిదర్శనమని వక్తలు పేర్కొన్నారు. ఎన్‌సీసీ అఫీషియేటింగ్ గ్రూప్ కమాండర్ కోల్ శివ గెహ్లాట్, ఎన్‌సీసీ కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ తపస్ మాండల్, సుమారు 500 మంది ఎన్‌సీసీ క్యాడెట్లు పాల్గొన్నారు.

కదంతొక్కిన పెన్షనర్లు

బీచ్‌రోడ్డు: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆర్థిక బిల్లు 2025లో భాగంగా సీసీఎస్ పెన్షన్ రూల్స్‌కు చేసిన చట్ట సవరణలకు వ్యతిరేకంగా పెన్షనర్లు ఆందోళన చేపట్టారు. శుక్రవారం ఫోరం ఆఫ్ సివిల్ పెన్షనర్స్ అసోసియేషన్స్ ఆధ్వర్యంలో గాంధీ విగ్రహం వద్ద మానవహారం నిర్వహించి తమ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కాన్ఫెడరేషన్ ఆఫ్ సెంట్రల్ గవర్నమెంట్ ఎంప్లాయీస్ చైర్మన్ రెడ్డి వెంకటరావు మాట్లాడుతూ కేంద్రంలోని మోదీ బీజేపీ ప్రభుత్వం పెన్షనర్లకు పెన్షన్ పెంచకుండా ఎగ్గొట్టాలని చూస్తోందని ఆరోపించారు. ఇందులో భాగంగానే పెన్షన్ చట్టానికి సవరణలు చేసిందని, ఇది పెన్షనర్లను కొత్త, పాత అని విభజిస్తోందని, ప్రస్తుత పెన్షనర్లకు నష్టం కలిగిస్తుందని అన్నారు. ఏఐబీడీపీఏ జిల్లా కార్యదర్శి, ఫోరం చైర్మన్ కె.రామాంజనేయులు మాట్లాడుతూ ఈ చట్టం చెల్లుబాటుకు వ్యతిరేకంగా 'ఫోరం ఆఫ్ సివిల్ పెన్షనర్స్ అసోసియేషన్స్' సుప్రీంకోర్టులో కేసు వేస్తోందని తెలిపారు. న్యాయపరమైన చర్యలతో పాటు, వివిధ రూపాల్లో నిరసనలు తెలియజేయాలని, అందులో భాగంగానే మొదటి చర్యగా మానవహారం నిర్వహించామని అన్నారు. బీఎస్ఎన్ఎల్, పోస్టల్, ఆర్ఎంఎస్, సెంట్రల్ పెన్షనర్స్, ఎన్ఎస్‌టీఎల్, ఈఎన్‌సీపీడబ్ల్యూఏ, ఇన్‌కమ్ టాక్స్, సెంట్రల్ ఎక్సైజ్, కస్టమ్స్, సీపీడబ్ల్యూడీ, జీఐసీ, ఏఐపీఆర్‌పీఏ, కేంద్రీయ విద్యాలయాలతో సహా వివిధ పెన్షనర్ల సంఘాల నుండి సుమారు 200 మంది పెన్షనర్లతోపాటు ఎం. చంద్రశేఖరరావు, ఎస్.ఎం. మౌలాలి, పి. గోపాలకృష్ణ, కె.వి. రామకృష్ణ, సంజీవరెడ్డి, అష్రాఫ్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



రోడ్డుకిరువైపులా నిల్చొని ఆందోళన చేస్తున్న పెన్షనర్లు

విజయవంతంగా కృత్రిమ లిగమెంట్ శస్త్రచికిత్స

తాటిచెట్లపాలెం: కృత్రిమ లిగమెంట్‌తో కూడిన మోకాలి శస్త్రచికిత్సను సీతమ్మధారలోని కిమ్స్ హాస్పిటల్‌లో విజయవంతంగా నిర్వహించారు. ఆస్పత్రి వైద్యులు, ఆర్థ్రోస్కోపిక్ సర్జన్ డాక్టర్ జి.శ్రీనివాస్ శుక్రవారం తెలిపిన వివరాలివి. నగరానికి చెందిన 28 ఏళ్ల యువతి ప్రమాదవశాత్తు కిందపడటంతో ఆమె మోకాలికి తీవ్ర గాయమైంది. నడవలేక ఇబ్బంది పడుతుండటంతో కిమ్స్ ఆస్పత్రికి తీసుకొచ్చారు. యువతిని పరీక్షించిన వైద్యులు మూడు ప్రధాన అంశాలను గుర్తించారు. ఆమె వయసు తక్కువ కావడం, మహిళ కావడంతో లిగమెంట్ నిర్మాణంలో కొన్ని ప్రత్యేకతలు ఉండటం, ఊబకాయం ఉండటంతో.. సాధారణ ఆర్థ్రోస్కోపిక్ ద్వారా ఆటోగ్రాఫ్టింగ్ చేస్తే ఆమెకు కొంతకాలం తర్వాత మళ్లీ సమస్య వచ్చే ప్రమాదం ఉందని భావించారు. ఈ నేపథ్యంలో ఆమెకు కృత్రిమ లిగమెంట్‌ను అమర్చాలని నిర్ణయించారు. ఈ కృత్రిమ గ్రాఫ్టులు బలంగా ఉండి, ఎంత బరువునైనా తట్టుకోగలవని, అంతేకాకుండా కాలం గడిచే కొద్దీ ఇవి సహజమైన లిగమెంట్లతో కలిసిపోతాయని డాక్టర్ శ్రీనివాస్ వివరించారు. సాధారణ పద్ధతిలో చేసే శస్త్రచికిత్స తర్వాత కొద్ది వారాలు కాలు నేలమీద ఆనించడం కుదరదని, అయితే ఈ కృత్రిమ గ్రాఫ్టుల వినియోగంతో శస్త్రచికిత్స మరుసటిరోజు నుంచే నడక సాధన ప్రారంభించవచ్చని తెలిపారు. ఇది ఆర్థ్రోస్కోపిక్ సర్జరీలలో ఒక కొత్త అధ్యాయమని పేర్కొన్నారు. ఈ అధునాతన శస్త్రచికిత్సను రాష్ట్రంలో తమ ఆస్పత్రిలోనే తొలిసారిగా నిర్వహించినట్లు డాక్టర్ వెల్లడించారు.

భద్రత ప్రమాణాల మెరుగే లక్ష్యం

విశాఖ సిటీ: వికసిత్ భారత్–2047లో భాగంగా కెమికల్స్, పెట్రో కెమికల్స్ రంగంలో భద్రత ప్రమాణాల బలోపేతం లక్ష్యంగా భారత ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు సీపెట్ డైరెక్టర్ జనరల్ ప్రొఫెసర్ శ్రీషిర్ సిన్హా తెలిపారు. శుక్రవారం నగరంలోని ఓ హోటల్లో 'కెమికల్స్ అండ్ పెట్రోకెమికల్స్ ఇండస్ట్రీ సేఫ్టీ'పై రెండు రోజుల శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సిన్హా మాట్లాడుతూ కెమికల్స్ అండ్ పెట్రోకెమికల్స్ రంగం దేశ ఆర్థిక వ్యవస్థలో కీలకంగా మారనుందన్నారు. అటువంటి కీలక రంగంలో ప్రమాదాల నివారణకు, పర్యావరణ పరిరక్షణకు చేపట్టాల్సిన చర్యలను వివరించారు. అనంతరం పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాలు, ప్రమాదాలు జరిగే సమయంలో చేపట్టాల్సిన చర్యలపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. సీపెట్ డైరెక్టర్ ప్రొఫెసర్ శాలివాహన్, ఫ్యాక్టరీస్ జాయింట్ చీఫ్ ఇన్‌స్పెక్టర్ శివశంకర్ రెడ్డి, సీపెట్ డైరెక్టర్ అండ్ హెడ్ డాక్టర్ చింతాశేఖర్ రసాయనిక పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాలపై వివరించారు. కార్యక్రమంలో 75 రసాయన పరిశ్రమల నుంచి 114 మంది ప్రతినిధులు హాజరయ్యారు.